రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

వ్యవసాయ సలహా మండలి సమావేశాల్లో వక్తలు



నున్న గ్రామంలో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి రంగనాథ్‌బాబు

కంకిపాడు: ఈ-క్రాప్ నమోదు నూరుశాతం పూర్తి కావాలని వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చాట్ల విజయ్‌బాబు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో వ్యవసాయ సలహా మండలి సమావేశం చైర్మన్ చాట్ల విజయ్‌బాబు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. విజయ్‌బాబు మాట్లాడుతూ దాళ్వా పంట నమోదు ప్రక్రియ పూర్తి కావస్తుందని, రైతులు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ఖరీఫ్ పంట కాలంలో ధాన్యం కొనుగోళ్లకు గానూ ఇప్పటికే రూ.63 కోట్లు రైతుల ఖాతాలకు జమ అయ్యిందని, ఇంకా రూ.7 కోట్లు పెండింగ్ ఉందని, సొమ్ము విడుదల అయ్యేలా చూడాలని కోరారు. ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం కృషి చేస్తుందని, పథకాలను అర్హులైన ప్రతి రైతుకీ అందేలా చూడాలన్నారు. ఏఓ పీఎం కిరణ్ మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల్లో వ్యవసాయ యంత్ర పరికరాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా రైతులు గ్రూపులుగా ఏర్పడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ టీవీ సతీష్, దుర్గగుడి బోర్డు మాజీ సభ్యుడు నెరుసు సతీష్, అగ్రిబోర్డు డైరెక్టర్లు నకరికంటి శేఖర్, జొన్నలగడ్డ నాగేశ్వరరావు, పలు శాఖల అధికారులు, వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు చేయించండి

నున్న(విజయవాడరూరల్): రబీ సీజనలో సాగు చేస్తున్న పంటలను రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు అన్నారు. శుక్రవారం నున్న రైతుభరోసా కేంద్రంలో మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ యర్కారెడ్డి నాగిరెడ్డి అధ్యక్షతన సలహా మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కొందరు రైతులు ధాన్యం విక్రయించిన వారికి డబ్బులు అందలేదని అడిగారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఏఓ తెలిపారు. రబీసీజన్‌కు సంబంధించి మండలంలోని అన్ని రైతుభరోసా కేంద్రాల్లో ఎరువులు పుష్కలంగా ఉన్నాయన్నారు.అంతర్జాతీయ చిరుధాన్యాల 2023 సంవత్సరంలో చిరుధాన్యాలను రైతులు సాగు చేయాలని కోరారు. పశు సంవర్ధకశాఖ అధికారిణి కె.ప్రసన్న మాట్లాడుతూ మేకలు, గొర్రెలకు ఉచితంగా టీకాలను ఆసుపత్రిలో వేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో సొసైటీ డైరెక్టర్ భీమవరపు ముత్తారెడ్డి, రైతులు పోలారెడ్డి రమేష్‌రెడ్డి, శనగల రాఘవేంద్రరావు ఏఈఓ సురేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన ఎక్స్‌ప్లోరర్స్ మీట్



నృత్యం చేస్తున్న విద్యార్థులు



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు ఎస్సార్కే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న ఎక్స్‌ప్లోరర్స్ మీట్-2023 శుక్రవారంతో ముగిసింది. ఈ సాంకేతిక ప్రదర్శనలో కళాశాలలోని ఈసీఈ, ఈఈఈ, ఐటీ విభాగాల విద్యార్థులు తాము తయారు చేసిన పలు రకాల ప్రాజెక్టులను ప్రదర్శించి పలువురు మన్ననలు అందుకున్నారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా విద్యార్థులు ఆట, పాటలతో సందడి చేశారు. ఒక పక్క సంప్రదాయ నృత్యాలతో పాటు మరో పక్క పాశ్చాత్య నృత్యాలను ప్రదర్శించి అబ్బుర పరిచారు. ముఖాభినయం, కామెడీ స్కిట్, సందేశాత్మక నాటికలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ఏకాంబరం నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు మేథో సంపత్తికి పదును పెట్టి దేశానికి ఉపయోగపడేలా నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. అనంతరం ఈ ఎక్స్‌ప్లోరర్స్ మీట్‌లో విద్యార్థులు ప్రదర్శించిన ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి కళాశాల చైర్మన్ బోయపాటి అప్పారావు, సెక్రటరి శ్రీకృష్ణ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రతాప్, జీడీకె కిషోర్, పలు విభాగాధిపతులు శ్రీ గౌరి, కిషోర్ కుమార్, ఎస్. నాగేశ్వరరావు, ఆషాలత, సత్యనారాయణ, అనిత, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో తీరని అన్యాయం



తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న సీపీఐ నేతలు

కంకిపాడు: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి తీరని అన్యాయం జరిగిందని సీపీఐ జిల్లా ఇన్‌చార్జి కార్యదర్శి టీ తాతయ్య విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయం, అదాని ఆస్తుల్ని జప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కంకిపాడు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందించారు. తాతయ్య మాట్లాడుతూ ప్రత్యేక హోదా కల్పించాలని విభజన చట్టంలోని హామీలు, పోలవరం ప్రాజెక్టు, విశాఖ ఉక్కు అంశాలపై ఎలాంటి ఊసు లేదన్నారు. పార్టీ నియోజకవర్గ సహాయ కార్యదర్శి మున్నంగి నరసింహారావు, కమిటీ సభ్యులు మేరుగు విజయ్‌కుమార్, మోతుకూరి అరుణ్‌కుమార్, బండి వెంకటరత్నం, రమేష్ పాల్గొన్నారు.

కట్నం వేధింపుల కేసు నమోదు

పెనమలూరు: కట్నం కోసం వేధిస్తున్న భర్తపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం ప్రకారం తాడిగడపకు చెందిన రాధిక ఐదు సంవత్సరాల క్రితం ప్రైవేటు పాఠశాలలో పీఈటీగా పని చేస్తున్న మెండు నందకుమార్‌ను వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. అయితే ఇటీవల భర్త అదనపుకట్నం కోసం వేధించటంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్తపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసుల తెలిపారు.

వీరమ్మ తిరునాళ్లలో భక్తజన కోలాహలం



అమ్మవారికి పొట్టేళ్లను మొక్కుబడిగా సమర్పిస్తున్న భక్తులు



తిరునాళ్లలో డప్పు కళాకారుల విన్యాసాలు

ఉయ్యూరు: వీరమ్మతల్లి తిరునాళ్లలో భక్తజన కోలాహలం నెలకొంది. ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో శుక్రవారం ఉయ్యూరు భక్తజన సంద్రంగా మారింది. డప్పు వాయిద్యాలతో చలువ కావిళ్లతో పొట్టేళ్లు, కోళ్లతో ఊరేగింపుగా తరలివచ్చి గులాం చిమ్ముకుంటూ అమ్మవారిని దర్శించుకుని భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. తల్లికి పొంగలి నైవేద్యంగా సమర్పించారు. శిడిబండి ఉత్సవాన్ని కనులారా తిలకించి భక్తిపారవశ్యం చెందారు. భక్తిశ్రద్ధలతో పూజలు జరిపించారు. నూతన ఏఎస్ఐగా బాధ్యతలు చేపట్టిన ఆకునూరుకు చెందిన రమేష్ అమ్మవారిని దర్శించుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

పరస్పర ఫిర్యాదులపై కేసుల నమోదు

ఉంగుటూరు: వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుల పరస్పర ఫిర్యాదులపై ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసులు నమోదయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం మండలం వీరపనేని గూడెంలోని జెడ్పీ హైస్కూల్‌లో హిందీ టీచర్ శివకుమారి, హెచ్ఎం ఎ.వెంకటేశ్వరరావులు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు. హెచ్ఎం, ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు సురేష్ ఇరువురు.. నీవు అంబేడ్కర్ ఇచ్చిన రిజర్వేషన్‌తో ఎస్సీ కేటగిరిలో ఉపాధ్యాయురాలు అయ్యావని హేళన చేస్తూ కులం పేరుతో దుషిస్తూ ఎన్నోమార్లు ద్వంధ్వ అర్థాలతో అవమానించారని శివకుమారి ఫిర్యాదు చేసింది. శివకుమారి ఈ నెల 8వ తేదీన కొందరు ఉపాధ్యాయులతో కలిసి ఘర్షణ పడి చెప్పుతో తనపై దాడి చేసిందని, అమెకు మద్దతుగా ఉపాధ్యాయులు ఉమాశంకర్, వెంకటేశ్వరనాయక్, జ్యోతి వచ్చారని హెచ్ఎం వెంకటేశ్వరరావు ఫిర్యాదు చేశారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు రెండు కేసులు నమోదు చసినట్లు ఎస్ఐ సూర్య శ్రీనివాస్ తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

హనుమాన్‌జంక్షన్ (గన్నవరం): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం..మండలంలోని సింగన్నగూడెంకు చెందిన తొమండ్రు రవిప్రసన్న ద్విచక్ర వాహనంపై గురువారం రాత్రి హనుమాన్ జంక్షన్ వస్తుండగా వేలేరు ఫ్లైఓవర్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆతనిని 108లో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రవిప్రసన్న శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి సోదరుడు కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కేంద్ర బడ్జెట్లో నిధులు పెంచాలి



ధర్నా చేస్తున్న రైతు సంఘ నేతలు

గన్నవరం: కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి నిధులు పెంచాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పెద్దు వాసుదేవరావు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పిలుపు మేరకు శుక్రవారం స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ.. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని చెప్పిన కేంద్ర ప్రభుత్వం రైతులపై భారాలు వేయడం సిగ్గుచేటన్నారు. సంఘ నేతలు కాట్రగడ్డ రామచంద్రజోషి, ముక్కామల ఉమామహేశ్వరరావు, బండారు లక్ష్మయ్య, కట్టవరపు విజయరావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో డ్రైడే

గన్నవరం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యాన డ్రైడే నిర్వహించారు. మండల వైద్యాధికారి జె.సంధ్య మాట్లాడుతూ మురుగునీటి కారణంగా దోమలు పెరిగి ప్రజారోగ్యాన్ని ఇబ్బందులకు గురి చేస్తాయన్నారు. ఇళ్లల్లో పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. ఏఎస్ఎం మేరీ గ్రేస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాదలవారిగూడెం గ్రామంలో లెప్రసీ నివారణపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. పలువురు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రేణుకా అంకమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠ



పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్న భక్తులు

కంకిపాడు: శ్రీరేణుకా అంకమ్మతల్లి నూతన దేవాలయ విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. నెప్పల్లి గ్రామంలో నూతనంగా పునర్నిర్మించిన దేవినేని వారి ఇలవేల్పు శ్రీ రేణుకా అంకమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. మూడు రోజులు పాటు నిర్వహించిన ప్రతిష్ఠా మహోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. ఉత్సవాలను శ్రీ రేణుకా అంకమ్మతల్లి ట్రస్టు ప్రతినిధులు దేవినేని ప్రేమ్‌కుమార్, దేవినేని ఉపేంద్ర, దేవినేని రవీంద్రనాథ్ పర్యవేక్షించారు.

గ్రామంలో వైద్య సేవలను మెరుగుపర్చాలి

నున్న(విజయవాడరూరల్): గ్రామంలో వైద్యసేవలను మెరుగుపర్చాలని నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ సూచించారు. శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో వైద్యసిబ్బందితో ఆయన వీహెచ్ఎస్ఎన్‌సీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామ సచివాలయం పరధిలో సీజనల్ వ్యాధులు రాకుండా ఎప్పటికప్పుడు ఇంటింటికెళ్లి తగిన జాగ్రత్తలు తెలియజేయాలన్నారు. గర్భిణులు అందరూ ప్రభుత్వాసుపత్రిలో ప్రసవం జరిగేటట్టు చూడాలన్నారు. గ్రామంలో కొత్తగా నలుగురు కొత్త ఆశావర్కర్లు జాయిన్ అయినట్టు సూపర్‌వైజర్ కన్నబాబు తెలిపారు. సమావేశంలో సూపర్‌వైజర్లు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు, ఏఎస్ఎమ్‌లు, ఆశాలు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



పెనమలూరు: గ్రామ /వార్డు సచివాలయాల ఎంప్లాయిస్ ఫెడరేషన్ కృష్ణా జిల్లా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సునితాశర్మ క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఉద్యోగులకు అందజేశారు. ఏవో లోయ శివశంకర్, ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ



గన్నవరం:ఎస్సీవర్గీకరణవిషయంలో బీజేపీ నమ్మించి మోసం చేసిందని మహాజన సోషలిస్ట్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మంద వేణబాబు పేర్కొన్నారు.ఎస్సీ వర్గీకరణ కోరుతూ చేపట్టిన విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి దిగ్బందం పోస్టర్‌ను పలువురు శుక్రవారం ఆవిష్కరించారు. చిన్నసుబ్బారావు,రాజేశ్వరరావు, ఆశీర్వాదం, చిన బాబు, సిద్ధు, వాసు, జమ్మి పాల్గొన్నారు.

అందరికీ మెరుగైన వైద్యమే ప్రభుత్వ లక్ష్యం



కంకిపాడు: మెరుగైన వైద్యం అందరికీ అందించాలనేలక్ష్యంతోప్రభుత్వం పనిచేస్తుందని మద్దూరు సర్పంచ్ చిప్పల రామదాసు అన్నారు. డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం మద్దూరు గ్రామంలో శుక్రవారం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ రామదాసు ప్రారంభించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ వీవీ రాజేష్‌కుమార్ 120 మంది అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. సర్పంచ్ రామదాసు చేతులమీదుగా కళ్లజోళ్లు అందించారు.ఎంపీటీసీ వడుగు శ్రీనివాసరావు, పి.ఆంజనేయులు. పి.నాగార్జున, ఏ.మోహన్‌రావు, వైద్య సిబ్బంది డి.రజిని, జి.వెంకటరమణ పాల్గొన్నారు.

సాగులో సేంద్రియ పద్ధతులు పాటించాలి

కంకిపాడు: సేంద్రియ వ్యవసాయ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయాధికారి పీఎం కిరణ్ సూచించారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కిరణ్ మాట్లాడుతూ రైతులు తాము పండిస్తున్న పంట పొలాల్లో కనీసం ఎకరం పొలంలోనైనా సేంద్రియ విధానంలో సాగు చేపట్టాలని సూచించారు. తద్వారా నాణ్యమైన పంట దిగుబడులు, ఖర్చులు ఆదా అవుతాయన్నారు. రైతు జి.వెంకటేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు అప్పగింత

పెనమలూరు: పెదపులిపాక గ్రామంలో అర్హులైన లబ్ధిదారులకు శుక్రవారం ఇళ్ల స్థలాలు అప్పగించారు. గ్రామంలో 325 మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు వణుకూరు గ్రామం లేఅవుటు-2 లో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. అయితే స్థలాలు అప్పగించక పోవటంతో గృహాల నిర్మాణం జరగలేదు. ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి,జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తొలి విడతగా గృహాలు నిర్మాణం చేసుకోవటానికి 115 మంది లబ్ధిదారులను వణుకూరు గ్రామానికి తీసుకు వెళ్లి స్థలాలు చూపించి అప్పగించారు. ఈ సందర్భంగా సర్పంచి వైఎస్సార్ సీపీ నేత గుంటూరు శ్రీనివాసచౌదరి మాట్లాడుతూ వచ్చే వారంలో మిగితాలబ్ధిదారులకు కూడా ఇళ్ల స్థలాలు స్వాధీనం చేస్తామన్నారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలసాయం, రుణం కూడా మంజూరు చేస్తుందని, లబ్ధిదారులు గృహాల నిర్మాణం చేపట్టాలని కోరారు.

శ్రీరస్తు.. శుభమస్తు

పేదింటి పెళ్లికి జగనన్న సాయం

- ప్రారంభమైన వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా
- జిల్లా స్థాయి కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ రంజిత్ బాషా
- బాల్య వివాహాల నిర్మూలన లక్ష్యంగా పథకం అమలు చేస్తున్నట్లు వెల్లడి
- జిల్లాలో 140 మందికి రూ. 1.24 కోట్లు సాయం



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, మేయర్ వెంకటేశ్వరమ్మ

చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ కల్యాణమస్తు, షాదీతోఫా పథకం ద్వారా నూతన జంటలకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఆర్థిక చేయూతను అందించింది. కృష్ణాజిల్లాకు సంబంధించి 140 మంది నూతన జంటలకు రూ. 1,24,95,000 లను లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేసినట్లు కృష్ణా కలెక్టర్ పి. రంజిత్‌బాషా తెలిపారు. శుక్రవారం ఉదయం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి లాంఛనంగా ప్రారంభించారు. ఈ ప్రారంభ కార్యక్రమాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్‌తో పాటు అధికారులు, నూతన వధూవరులు వీక్షించారు.

జిల్లాలో లబ్ధి ఇలా..

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత ఏడాది అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకు వివాహాలు చేసుకుని అర్హత ఉన్న జంటలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. వివాహం చేసుకున్న వారికి లక్ష రూపాయలు, కులాంతర వివాహం చేసుకున్న వారికి రూ. 1.20 లక్షలు, దివ్యాంగులకు రూ. 1.50 లక్షలు ప్రభుత్వం ప్రోత్సాహంగా అందిస్తోందన్నారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు వైఎస్సార్ కల్యాణమస్తు, ముస్లింలకు షాదీతోఫా పేరుతో ఈ పథకం అమలు చేస్తోందన్నారు. జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో 20 జంటలకు, గన్నవరం 15, గుడివాడ 18, మచిలీపట్నం 15, పామర్రు 16, పెడన 26, పెనమలూరు 30 జంటలకు ఈ పథకం ద్వారా సాయం అందించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంయూడీఏ చైర్‌పర్సన్ బొర్రా దుర్గాభవాని, నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ తంటిపూడి కవితథామస్‌నోబుల్, మాజీ చైర్మన్ షేక్ సలార్‌దాదా, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్, జిల్లా మైనార్టీ సంక్షేమాధికారిణి షంషున్నీసాబేగం, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ సాధికారత అధికారి కె సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఆర్ పేట నివాసితులకు న్యాయం చేస్తాం

జేసీ శ్రీవాస్ నుపూర్ అజయ్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాజరాజేశ్వరిపేటలోని రైల్వే స్థలంలో నివసిస్తున్న కుటుంబాలకు న్యాయం చేయడానికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ శ్రీవాస్ నుపూర్ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. రాజరాజేశ్వరి పేట రైల్వే స్థల నివాసితులు, గన్నవరం నియోజకవర్గ పరిధిలోని పలు సమస్యలపై శుక్రవారం జాయింట్ కలెక్టర్ రైల్వే, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జేసీ మాట్లాడుతూ 56 డివిజన్‌లోని రైల్వే స్థలంలో గత 40 సంవత్సరాలకు పైగా దాదాపు 800 కుటుంబాలు నివసిస్తున్నాయన్నారు. వీరికి ప్రత్యామ్నాయ స్థలాన్ని చూపడానికి నగరపాలక సంస్థ అధికారులు రైల్వే అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. గన్నవరం నియోజకవర్గ పరిధిలోని విజయవాడ రూరల్ మండలంలోని నున్న, రామవరప్పాడు, ప్రసాదంపాడు తదితర గ్రామాలలోని సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. నదీ జలాలను అందించడం, నున్న, రామవరప్పాడుల్లో రైతుబజార్ల ఏర్పాటు,ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించడం తదితర సమస్యలను త్వరితగతినపరిష్కరించాలన్నారు. సమావేశంలో డీఆర్వో మోహన్‌కుమార్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ డి. దుర్గాప్రసాద్, తహసీల్దార్లు మాధురి, జాహ్నవి, రైల్వే అధికారులు ఉన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

ఉంగుటూరు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు వేగవంతం చేసే విధంగా లబ్ధిదారులకు అవగాహన చేయాలని ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు ఆదేశించారు. తేలప్రోలు సచివాలయంలో గృహనిర్మాణాల పురోగతిపై సమీక్ష శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ ఇంటి బిల్లులు ఎప్పటికప్పుడు ప్రభుత్వం మంజూరు చేస్తోందని ప్రతి ఒక్కరూ ఇంటి నిర్మాణాలు వేగవంతం చేయాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. హౌసింగ్ ఏఈ సురేష్, కార్యదర్శి కృపాకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ పరమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, నూతన స్తంభాల ఏర్పాటు నిమిత్తం ప్రధాన గ్రామంతో పాటు జాతీయరహదారి నుంచి ఇన్‌క్యాప్ వరకు, జక్కుల నెక్కలం తదితర ప్రాంతాల్లో విద్యుత్ నిలిపివేస్తామని వినియోగదారులు సహకరించాలని కోరారు.

గన్నవరం: మండలంలోని కేసరపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని 33/11కేవీ విద్యుత్ సరఫరా లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఆపరేషన్ ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని కేసరపల్లి, అజ్జంపూడి, బుద్ధవరం, బూతిమిల్లిపాడు, వీఎన్.పురం కాలనీ, ఎస్ఎల్వీ లైలా, జక్కులనెక్కలం జగనన్న కాలనీలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పెనమలూరు:యనమలకుదురు,పెనమలూరు సెక్షన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని ఈఈ పి.హరిబాబు తెలిపారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ యనమలకుదురు సబ్‌స్టేషనర్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. ఈ కారణంగా ఇందిరానగర్, డొంకరోడ్డు, అవనిగడ్డ కరకట్ట ప్రాంతాలు, యనమలకుదురు గ్రామంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే పెనమలూరు, గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరం, పోరంకి గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు. ఆయా గ్రామాల ప్రజలు తమ సిబ్బందితో సహకరించాలని కోరారు.

లబ్ధిదారులకు అవగాహన

రామవరప్పాడు: జగనన్న కాలనీల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రావాలని ఎనికేపాడు సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం ఇళ్ల స్థలాలు పొందిన లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 790 మందికి స్థలాలు మంజూరవగా 765 మంది ఇళ్లు నిర్మించుకునేందుకు ముందుకు వచ్చినట్లు తెలిపారు. 212 మంది లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణ పనులు చురుగ్గా జరుగుతున్నాయన్నారు. మిగతా లబ్ధిదారులు కూడా ముందుకు రావాలని సూచించారు. కొత్తగా 54 మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు బ్యాంక్ అకౌంట్లను ఓపెన్ చేశారు. ఈ సమావేశంలో కాంట్రాక్టర్ మాదు సుబ్బారావు, పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధిపై అవగాహన ఉండాలి



గన్నవరం: కుష్ఠు వ్యాధిపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కుష్ఠు నియంత్రణ కేంద్రం అధికారి డాక్టర్ వేణుగోపాల్ సూచించారు. మండలంలోని కేసరపల్లి శివారు వీకేఆర్ కళాశాలలో శుక్రవారం కుష్ఠు వ్యాధి నిర్ధారణ-నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ శరీరంలో వ్యాధి నిరోధక శక్తి తగ్గినప్పుడు వ్యాధుల బారిన పడతారని చెప్పారు. శరీరంపై తుప్పురంగు మచ్చలు, కంటి రెప్పలపై వెంట్రుకలు రాలిపోవడం, చెవులపై కణతులు రావడం కుష్టువ్యాధిలక్షణాలుగా భావించాలని తెలిపారు. ఈ వ్యాధి నిర్ధారణ కోసం వెంటనే వైద్యులను సంప్రదించాలని వివరించారు. ఈ వ్యాధి నియంత్రణకు అవసరమైన మందులు పూర్తిగా అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఇది అంటు వ్యాధి కాదని, వ్యాధిగ్రస్తులను హీనంగా చూడవద్దనిసూచించారు. డీఏపీఎంఓ వెంకటరాజు, ఎంఓ మాధవీ, సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయ కళాశాల విద్యార్థినుల ప్రతిభ

పెనమలూరు: కానూరు సిద్ధార్థ న్యాయ కళాశాల విద్యార్థినులు మహిళా ఫేస్ట్‌లో ప్రతిభ చాటారు. విజయవాడ పీబీ సిద్ధార్థ కాలేజీలో ఈ నెల 8, 9 తేదీల్లో తరుణి తరంగాలు మహిళా ఫేస్ట్‌లో న్యాయ కళాశాల విద్యార్థినులు వివిధ పోటీల్లో పాల్గొన్నారు. పలు పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపి బహుమతులు గెలుచుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కాలేజీలో శుక్రవారం ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నుపాటి దివాకర్‌బాబు, అధ్యాపకులు విద్యార్థినులకు అభినందించారు.

పోస్టులు భర్తీ చేయండి

పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు కార్యదర్శుల పోస్టులు (అడ్మిన్) వెంటనే భర్తీ చేయాలని బీసీ సంఘ ప్రధాన కార్యదర్శి కోసూరి నరేష్‌కుమార్ అన్నారు. ఆయన ఈ మేరకు గ్రామ/వార్డు సచివాలయాల ప్రధాన కార్యదర్శికి శుక్రవారం వినతి పత్రం అందజేశారు. తాడిగడప మున్సిపాలిటీలో 19 వార్డు సచివాలయాలు ఉండగా అందులో 10 సచివాలయాల్లో కార్యదర్శులు లేరన్నారు. దీని కారణంగా రేషన్ కార్డులు మార్పులు, చేర్పులు చేయడంలో సాంకేతికపరంగా సమస్యలు తలెత్తుతున్నాయని అన్నారు. అధికారులు ఈ సమస్య పరిష్కారానికి వెంటనే దృష్టి పెట్టాలని కోరారు.